
# గాంధీగారి భారతదేశం

**- శ్రీమతి పోడూరి కృష్ణకుమారి**



ఒక సినిమా నటుడిని విదేశీ ఎయిర్‌పోర్ట్‌లో రొటీన్ చెకప్‌కోసం కొంతసేపు ఆపారు. మీడియా పూనకంతో ఊగిపోయి పేట్రేగిపోయింది. ప్రముఖులతో సహా అందరూ మండిపడ్డారు.

మహాత్ముడి బ్రాండ్‌తో విదేశీ సంస్థ పదకొండు లక్షలు ఖరీదుచేసే పెన్ను తయారుచేసి అమ్ముతామన్నారు. ప్రముఖులూ పాలకులూ కూడా తమకేం వినబడదూ కనబడదూ అన్నట్టు మాటాడకూరుకున్నారు.

కానీ వినయ్ వెళ్లి ఆ ఉద్యోగంలో చేరతానంటే మాత్రం వెంకట్రావు అలా ఊరుకోలేదు. పూనకంతో ఊగిపోయి మండిపడ్డాడు. పెద్ద పెద్ద కేకలు పెట్టాడు. వినయ్ తండ్రి లెండి వెంకట్రావు.

"అంత పరమ పల్లెటూళ్ళో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం ఏవిట్రా ఫిజిక్స్‌లాంటి సబ్జెక్ట్‌లో పిహెచ్‌డి పట్టాకూడా పుచ్చుకునీ?! బుద్ధున్న వాడెవడూ ఆ మారుమూలకిపోయి అక్కడ చేరడు" అరిచాడు మూడోసారి. వినయ్ మాటాడలేదు.

"ఒరేయ్, ఎప్పుడో గాంధీగారి కాలంనాడు భారతదేశం పల్లెటూళ్లల్లో ఉండేది. ఇప్పుడు భారతదేశమంతా అమెరికాలో ఉంటోంది. లేదంటే మెట్రో సిటీల్లో ఉంటోంది. కరువూకాటకాలు తప్ప పల్లెటూళ్ళల్లో ఇంకేం నివసించట్లా. నీకు విదేశాలిష్టం లేకపోతే ఇక్కడే హైదరాబాదులోనే ఉండు. ఎమ్‌సెట్ కుర్రాళ్ళకి కోచింగులిచ్చుకుంటే కోట్లు సంపాదించవచ్చు. నువ్వు సుఖపడి మమ్మల్ని సుఖపెట్టచ్చు."

"డబ్బు సంపాదనే ధ్యేయంగా నేనుండలేను". అప్పటికి నోరిప్పాడు వినయ్.

"డబ్బు సంపాదించవా మరేం చేస్తావ్?" విస్తుబోయాడు వెంకట్రావ్.

"నాకు టీచింగిష్టం. జీతమూ వస్తుంది ఈ ఉద్యోగంలో చేరితే. ఇంకా నాకు ఆశయాలున్నాయి. అవి సాధించడానికి వచ్చే జీతం చాలు."

"ఆశయాలా?!" అదేదో ఎప్పుడూ ఎక్కడా వినని మాటలాగా వింతగా చూసాడు.

"పల్లెల్లో విద్యార్థులు చాలా నిర్లక్ష్యానికి గురవుతున్నారు. వాళ్ళకీ ఎమ్సెట్టొక్కటే కాదు జీవనాన్నిచ్చే చదువులింకా ఉన్నాయి అని తెలియచెప్పే వాళ్ళు లేక పట్నాల్లో విద్యార్థుల్లాగే ఎమ్‌సెట్‌కోసం ఎగబడుతున్నారు. అర్హతున్న విద్యార్థులు కూడా నగరాల్లో కుర్రాళ్లతో పోటీపడలేకపోతున్నారు. వాళ్లందరికీ సరైన దిశానిర్దేశం చేసే వాళ్ళుండాలి."

"ఆహాఁ! అదేదో ఆ నిర్దేశం నువ్వు కంకణం కట్టుకుని చేస్తావా?" "తప్పేంటీ?"

నోట మాటరానట్టు పెళ్ళాం వైపు చూసాడు వెంకట్రావ్. ఆవిడకసలు కొడుకేమంటున్నాడో అర్థంకాలేదు. ఇప్పుడు వీడి నిర్వాకంవల్ల తనకు తిట్లు పడతాయేమోనని హడలిపోయింది క్షణంపాటు. వెంకట్రావ్ మళ్ళీ కొడుకువైపు తిరిగాడు. అలివేలు బీపీ నార్మల్‌కొచ్చింది.

"చూడు. కళ్లుపెట్టుకుని ఈ చుట్టుపక్కల సమాజాన్ని చూడు. అందరి పిల్లలూ ఎలాగోలా తంటాలుపడి అమెరికా పోతున్నారు. వాళ్ళకి పెద్ద పెద్ద సంబంధాలొస్తున్నాయి పెళ్ళిళ్ళు చేసుకుని తలిదండ్రుల్ని కూడా అమెరికా తీసుకుపోయి తిప్పుతున్నారు. మమ్మల్నొదిలెయ్. రేపు నీకిక్కడే మారుమూల ఉద్యోగం అంటే ఎవడైనా పిల్లనిస్తాడా? నీ సంగతైనా నువ్వాలోచించుకోరా."

"నాకసలు పెళ్లంటే ఇంటరెస్ట్ లేదు ప్రస్తుతం."

ఇంకో రూటు ట్రై చేసాడు వెంకట్రావ్. "ఒరే వెర్రి నాగన్నా. విదేశాలకెళ్ళి కొన్నేళ్లు ఉద్యోగమో సద్యోగమో వెలగబెట్టి కోట్లు సంపాదించుకొచ్చినవాడు ఆశయాలు, ప్రజాసేవ, పల్లెసేవ అంటే ముద్దుగా ఉంటుంది. పదిమంది చేరి తలో చెయ్యీ వేస్తారు అప్పుడు చెయ్యచ్చు ఆశయాల సాధన. నలుగురూ మెచ్చుకుంటారు. సన్మానాలు చేస్తారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఆశయాలేంటి? సేవేంటి? నవ్వుతారెవరైనా."

యథాప్రకారంగా వినయ్ ఏం మాటాడలేదు. అరచేత్తో బుర్ర కొట్టుకుంటూ వీధిలోకెళ్లిపోయాడు కోపం ఆపుకోలేని వెంకట్రావ్. "ఆయనకి వేపకాయంత వెర్రుంది. వీడికి వెలక్కాయంత!" గొణుక్కుంటూ మంచంమీద నడుం వాల్చింది అలివేలు.

నిజానికి వెంకట్రావు మారుమూల కుగ్రామంలో పుట్టి పెరిగినవాడే. పల్లెటూళ్లలో పనిచేసినవాడే, రిటైరయ్యే టైముకి, చిన్ననాటి స్నేహితుడొకడు వెతుక్కుంటూ వచ్చాడు. అతగాడు హైదరాబాదులో విద్యతో వ్యాపారం చేస్తూ అంతులేని ధనం ఆర్జిస్తున్నాడు. సిటీలో తనకున్న చప్పన్న కోచింగు సెంటర్లలో ఒక దానిమీద కర్ర పెత్తనం చెలాయించమని వెంకట్రావుకి అప్పగించాడు. ఈ సిటీలైఫు భార్యాభర్తలిద్దరికీ మహ బాగుంది. అందువల్ల కొడుకు మళ్లీ ఆ బురద కొట్టుకుపోయే ఊళ్లకే వెడతానంటే ఇద్దరికీ ఆశ్చర్యంగానే ఉంది.

తల్లినీ తండ్రినీ ఆశ్చర్యాంబుధిలో ముంచి తను ఆనందంగా గ్రామానికి వెళ్లిపోయాడు వినయ్.

వెళ్లి డ్యూటీలో చేరిన గంటనించీ ఒక పద్ధతి ప్రకారం పరిశీలన మొదలుపెట్టాడు. ఎవరెవరికి నిజంగా చదువులో ఆసక్తి ఉంది, ఎవరికి పైనించి అదనంగా సహాయం అవసరం మామూలుగా ఇంటరు, ఎమ్సెట్టూ, బీటెక్, మెడిసిన్ రొటీన్ కాకుండా ఇతర రంగాలలో ఎవరెవరికి ఆసక్తి ఉంది, ఎవరు కాస్త అందిస్తే అల్లుకుపోగలరు లాంటి క్రైటీరియా నిర్ణయించుకుని బాగా పరిశీలించాడు. తన దగ్గరికి ఇంకాస్త చదువు చెప్పమని తమంత తాము వచ్చిన ప్రతి విద్యార్థికీ లేదనకుండా చెప్పగలిగినంతా చెప్పడం మొదలెట్టాడు. విద్యార్థులు ఆ వూరి వాళ్ళే కాబట్టి సాయంత్రం కాలేజీ వదలంగానే వినయ్ ఇంటికొచ్చి కూచుని తెలీనివి చెప్పించుకుంటూ అక్కడే పడుకుండిపోయి పొద్దున్నే గురువుగారికింత కాఫీ కలిప్పెట్టి ఇళ్ళకి పోయేవారు. మళ్ళీ సాయంత్రం వచ్చేటప్పుడు ఇంట్లో వండిన కూరోపచ్చడో ఎవరు తేగలిగింది వాళ్ళు తెచ్చి ఆయన భోజనానికి ఏర్పాటు చేసేవారు.

ఓరోజు సూర్యం అనే స్టూడెంటొకడు, "అసలీ లెక్కలేం సదవకండానే మా తాత ఒక్క మిస్టీకు రాకుండా గీతలు గీసి చతుర్భుజాలు, వృత్తాలు తయారుచెయ్‌గలడండీ. మిస్టీకు అనకూడదు గదండీ మేష్టారూ? తవరు సెప్తానే ఉంటారు మిస్టేక్ అనాలని", సిగ్గుగా నవ్వేసాడు. వాడు ఇంటరులో స్నేహితులందరూ ఎమ్పీసీ తీసుకుంటున్నారని తనూ అదే తీసుకున్నాడు కానీ వాడికి కదలకుండా కూచుని చదవడం ఒళ్లుమంట. ఏదో చేసెయ్యాలని ఎప్పుడూ గిజగిజలాడిపోతుంటాడు. లెబొరేటరీలో కూడా "ఇదిలాగే ఎందుకు చెయ్యాలి?" అంటూంటాడు.

"మీ తాత ఏంచేస్తాడు?" ఓపిగ్గా అడిగాడు వినయ్.

"వడ్రంగవండి" హుషారుగా చెప్పాడు."

"నువ్వూ నేర్చుకుంటావా?"

"ఏంటండి? వడ్రంగవా? మా నాన్న చంపేస్తాడండి. చదివి బ్యాంకు ఉద్యోగం చెయ్యాలంట నేను."

"వాడి పంచాయతీ ఆఫీసులో ప్యూను."

"చదువుకో, అదీ నేర్చుకో. ఏర్పాటుచేద్దాం". సూర్యం కళ్లు మెరిసాయి."

"ఇంటరు ఫెయిలవడానికి వీల్లేదు!" షరతుపెట్టాడు వినయ్. సవాలు అంగీకరించాడు సూర్యం. వినయ్

ఉన్న ఇంటి పెరట్లో షెడ్డు వర్కుషాపైంది. కాళ్లు చాపుక్కూచున్న సూర్యం తాత పని నేర్పించడం మొదలెట్టాడు సాయంత్రాలు. మొదట సూర్యం ఒక్కడే. తరవాత పై ఊళ్లనించొచ్చి మరో ముగ్గురు చేరారు. "మేష్టారూ! వ్యవసాయం గురించి చదువులేం ఉండవాండీ?" కొత్తగా కాలేజీలో చేరిన పూజారి గారబ్బాయి రంగనాథ్ అడిగాడు ఒకరోజు వినయ్ దగ్గరకొచ్చి తన మాటలు ఎవరైనా వింటారేమోనన్నట్టు అటూ ఇటూ చూస్తూ.

"ఎందుకుండదూ? ఎజి బిఎస్సీ లేదా? ఇంటరెస్టుంటే బైపిలోకి మారిపో". సలహా ఇచ్చాడు.

"మా ఇంట్లో ఒప్పుకోరండి. వ్యవసాయం కడుపునిండేనా కాలునిండేనా ఈరోజుల్లో అంటారండి మా నాన్నగారు" అన్నాడు.

"మా బావ కిందటేడు బిటెక్కులో చేరాడండి. నన్ను కూడా అదే చదివిద్దామని ఈ ఎమ్పీసీలో పెట్టారండి. ఇప్పుడు మారతానంటే..." వినయ్ మాటాడలేదు. రెండు నిముషాలయ్యాక, "మారిపోతానండి ఇంకా టైముంది కదండీ" అతను వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం రెండు జతల బట్టలు, మొత్తం పుస్తకాలు మూటగట్టుకొచ్చి వినయ్ దగ్గర స్థిరపడిపోయాడు. పూజారిగారికి వినయ్ నచ్చజెప్పాడు.

ఏడాది గడిచేసరికల్లా విద్యార్థులూ వాళ్ల తలిదండ్రులు వినయ్ సహాయంకోసం చుట్టుపక్కల ఊళ్ళనించి కూడా రావడం మొదలయింది. వచ్చినవాళ్ళలో కొంతమంది అతనితోబాటు అతనింట్లో ఉండిపోతున్నారు.

గురువుగారికి వాళ్లే ఇంత వండిపెట్టి వాళ్ళు తిని చదువుకోవడం. చిన్న గురుకులం ఏర్పడిపోయింది. ఊళ్లో జనాలకి మొదట వింతగా ఉండేది.

'ఈ మేష్టరు వెర్రిబాగులోడేమో!'నని అనుమానపడ్డారు. కానీ తరవాత "వినయ్ మేష్టరు మా ఊరి దేవుడు!" అనడం పరిపాటయింది.

వెంకట్రావు, అలివేలు వచ్చి చూసారు. వాళ్ల గుండె చెరువయింది. "ఈ మఠం నడుపుకుంటూ ఎన్నాళ్లు బతుకుతావురా!"అని కేకలు పెట్టాడు వెంకట్రావు. ఓ కుర్రాడు మంచినీళ్లు తెచ్చిచ్చి, తాగేవరకూ మౌనంగా నుంచుని తాగాక గ్లాసు తీసుకుపోయాడు. వినయ్ కాలేజ్కెళ్లిపోయాడు. ఆరోజు ఇంట్లో ఉండిపోయిన అబ్బాయినొకడిని పిలిచి "మీ దగ్గర ఎంత జీతం తీసుకుంటున్నాడేంటి మీ మేష్టరు?" అని అడిగాడు. వాడు లెంపలేసుకున్నాడు.

"చిల్లిగవ్వ అడగరండి." అన్నాడు. గుండాగినంతపనయినా తట్టుకు నిలబడ్డాడు వెంకట్రావు.

"మరి మీకందరికీ మింగబెడుతున్నాడుగా? ఆ ఖర్చైనా పెట్టుకుంటున్నారా మీరు?" ఒక్క అరుపుఅరిచాడు కడుపు మండిపోయి."

"దానికెక్కర్లేటుంటదండి? అన్నీ ఊరోళ్లే ఎడతారుగదండి?" అన్నాడు వాడు. అప్పటిక్కాస్త మంట చల్లారింది.

"పోన్లే ఆ మాత్రం బుద్దేడిసింది మీ ఊరి వాళ్లకి"అని ఏడ్చుకుంటూ పెళ్లాంతో సహా మహానగరానికి మళ్లీ పోయాడు. అక్కడ కడుపులో మంట అప్పుడప్పుడు రగులుతూనే ఉంది. తను పనిచేసేచోట విద్యార్థులు ఒక్కొక్క నెలా జీతాలు కట్టినప్పుడల్లా కొడుకీపాటికెంత సంపాదించి ఉండాలి. ఇక్కడైతే అని లెక్కలేసుకున్నప్పుడల్లా."

"కోచింగులిచ్చుకుంటే కోట్లు సంపాదించవలసినవాడు, సన్నాసుల మఠం నడుపుకుంటున్నాడు!"అని చెప్పుకున్నాడు తనకి పెత్తనం ఇచ్చిన స్నేహితుడికి.

అదే సమయంలో కొంచెం ఇంచుమించు అవే మాటలు చెప్తున్నాడు సుబ్బారాయుడుగారు స్నేహితులతో.

"మా ముత్తాతగారి తమ్ముడొకాయన కాశీ వెళ్లి సన్యాసం పుచ్చుకుని మఠం స్థాపించాడని చెప్తుండేది మా అమ్మ. ఆ చిన్న ముత్తాతగారి పోలిక మా చిన్నమ్మాయి నీరజకొచ్చినట్టుంది" అన్నాడు. సుబ్బారాయుడు గ్రామంలో పెద్దలకి పెద్ద. ఆయన తన చిన్న కూతురిపట్ల విరక్తి చెందినట్టు అలా మాటాడడానికి కారణముంది. సరిగ్గా వెంకట్రావ్ అలివేలు సిటీవెళ్లే బస్సెక్కిన రోజే సిటీనించి నీరజ వచ్చింది వినయ్ ఉన్న పల్లెటూరికి. వినయ్లా ఉద్యోగంకోసం రాలా. పట్నంలో ఎగ్రికల్చర్ బిఎస్సీ చదివి, ఎమ్మెస్సీకి అప్లికేషన్లు పెట్టుకుంటోంది. అసలా బిఎస్సీ ఆ పిల్ల ఎందుకు చదివిందో సుబ్బారాయుడికి అర్థంకాదు. ఆయన పెద్ద కూతురూ, అల్లుడూ డాక్టర్లు. సిటీలో కార్పొరేట్ హాస్పిటల్ నడుపుతున్నారు.

"మీరంతా మీ పొలాలు బీళ్ళయితే కాయకష్టం చేసుకుంటారు. కానీ అడుక్కుతినరుగా? అలాగే మీ పశువులు కూడా బిచ్చగాళ్లు కాకూడదు. ఇంతో అంతో మీరు పెట్టిందే తినాలి. మీరు పశువుతో పాటు ఓ పది రూపాయలు ఇవ్వండి నాకు. మీ డబ్బుతో దానికి దాణా కొంటాను"

సరే ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే నీరజ ఆరోజు ఇంటికి చేరే దారిలో చిన్నకారు రైతు రంగన్న కుటుంబం ఎదురుపడింది. రంగన్న కూతురు గొల్లుగొల్లున ఏడుస్తోంది. శిష్యురాలిని చూసి ఆగిన నీరజ, "ఎందుకు పిల్లా, అంతలా ఏడుస్తున్నావ్?" అడిగింది.

"గౌరెమ్మని అమ్మేస్తన్నారమ్మాయిగారోలో!" అంటూ వాళ్లతోపాటు వస్తున్న ఆవు మెడ కావిలించుకుని మళ్లీ బావురుమంది వాణి.

"మరేం చెయ్యాలమ్మాయిగారూ? అది గొడ్డుపోయింది. వానలేక చేలెండిపోయాయి. మేం మళ్లీ వానలు పడేవరకూ కూలిపన్లకోసం మా బామ్మర్దింటికి పట్నం పోతున్నాం. ఈ గొడ్డుటావుని మేపలేం. అమ్ముతుంటే దీనిగోల!" రంగన్న నాలుగుముక్కల్లో వివరించాడు పరిస్థితి.

సరిగ్గా ఐదు సెకండ్లపాటు ఆలోచించింది నీరజ. "సరే. గౌరమ్మని మా ఇంటికి తోలుకురండి. మీరు పరిస్థితులు చక్కబడి తిరిగొచ్చేవరకూ దాని సంగతి నేను చూసుకుంటా. మీరు పట్నం పోండి. ఏం వాణీ, గౌరమ్మని చూసుకోడానికి నువ్వు నాతోపాటు మా ఇంట్లో ఉంటావా?" అంది. వాణి ఎగిరిగంతేసింది. గౌరమ్మతోపాటు ఉంటావా అనకుండా నాతోపాటు అనడం ఏదో వింతగా అనిపించలా వాణికి. ఆ వెర్రిది ప్రేమకి స్పందించింది. అంతే. ఐదే ఐదు క్షణాల్లో నీరజ తీసుకున్న నిర్ణయం రంగన్నకీ అతని భార్యకీ విడ్డూరం అనిపించలా. నీరజ మంచితనం వాళ్ళకి తెలియనిదా!

రిక్షాలో పెట్టీబేడాతో నీరజ, ఆవుని ప్రేమగా అదిలించుకుంటూ వాణి, వెనక బాడీగార్డులా సైకిల్ మీద పాలేరు మల్లన్న ఊరేగింపుగా ఊళ్ళోకి ప్రవేశించారు. గొడ్డుతోబాటు ఇంట్లోకొస్తున్న నీరజని చూసి నిట్టూర్చి రచ్చబండ దగ్గరకెళ్లిపోయాడు సుబ్బారాయుడు.

"మనకిన్ని గొడ్లున్నాయి వాటితోపాటు గౌరమ్మా నాతోపాటు వాణెమ్మా." అంది నీరజ తల్లితో.

"పోన్లే గొడ్డుటావుకి గడ్డేసినా పుణ్యమే అంటారు పంతులుగారు" అంది తల్లి శ్రీలక్ష్మి.

"కానీ ఏదో రోగం ఉందేమో అలా ఉంది! మన ఆవులకీ గేదెలకి అంటుకోదుకదా?" అనుమానం వ్యక్తం చేసింది.

"అది రోగం కాదమ్మా, మాల్ న్యూట్రిషన్" అంది నీరజ. తల్లి మాటాడలేదు. ఎందుకొచ్చిన గొడవ అన్నట్టు.

నీరజ మర్నాడు ప్రభుత్వ పశువులాస్పత్రికి వెళ్ళింది. అక్కడ డాక్టరు లేడు. కనుక్కుంటే. 'పాత డాక్టరు బదిలీ అయిపోయాడు, కొత్త డాక్టరు సెలవుమీద పోయాడు' అన్నారు. ఇంటికొచ్చి పశువైద్యం చదివిన కొంతమంది స్నేహితులకి ఫోన్లుచేసి, తన ప్రణాళిక తయారుచేసుకుంది. వాణిని ఎనిమిదో తరగతిలో చేర్పించింది. రెండు నెలలు గడిచేసరికి గౌరమ్మ తేరుకుంది. సుబ్బారాయుడిగారి ఇతర గొడ్లతోబాటు పాలివ్వడం మొదలెట్టింది. "అమ్మాయిగారు దేవత! గొడ్డుటావులు కూడా అమ్మాయిగారి కాళ్లదగ్గరపడేస్తే చాలు పాలిస్తున్నాయి!" అని ఊరంతా చెప్పుకున్నారు. వలస పోదలుచుకున్న కూలీలు, సన్నకారు రైతులు తమ గొడ్లను నీరజకప్పగించి 'మేం తిరిగొచ్చేవరకూ చూసుకో'మని దణ్ణాలెట్టి పోతున్నారు. అయితే నీరజకు కొన్ని ఆదర్శాలున్నాయి. "మీరంతా మీ పొలాలు బీళ్ళయితే కాయకష్టం చేసుకుంటారు. కానీ అడుక్కుతినరుగా? అలాగే మీ పశువులు కూడా బిచ్చగాళ్లు కాకూడదు. ఇంతో అంతో మీరు పెట్టిందే తినాలి. మీరు పశువుతోపాటు ఓ పది రూపాయలు ఇవ్వండి నాకు. మీ డబ్బుతో దానికి దాణా కొంటాను" అంది. వాళ్లకీ తెలుసు తాము తిరిగొచ్చేవరకూ ఆ పది రూపాయలతోటే తమ పశువుల పొట్టనిండదని. కానీ దాన్ని కసాయికి అమ్మెయ్యకుండా ఆఖరిసారి ఇంత పెడుతున్నాం అన్న తృప్తి వాళ్లకి కలిగేందుకే నీరజమ్మ అలా అంటోందని గ్రహించారు. కొందరు ఐదే ఇవ్వగలిగితే, కొందరు యాభై చేతిలో పెట్టారు. 'ఎవరూ బిచ్చగాళ్లుగా మారడం నీరజమ్మకి ఇష్టంలేదు.' ఆ గడ్డమీద పుట్టిపెరిగినవాళ్లు ఆమె హృదయం అర్థంచేసుకుని దీవించిపోయారు.

సుబ్బారాయుడికి వ్యవసాయమేకాక పట్నాల్లో వ్యాపారాలున్నాయి. వ్యవహారాలున్నాయి, రాజకీయం ఉంది. ఆయనకి కరువులు కాటకాలు అంటవు. "పశుగ్రాసం ట్రక్కుల్లో తెప్పించు నాన్నా" అని నీరజ అన్నప్పుడు రాబోయే ఎలక్షన్లు గుర్తొచ్చి కూతురు చెప్పినట్టే చేసాడు. వాళ్లింటి వెనక దొడ్డి పశువులతో నిండి బృందావనంలా కళకళలాడింది.

అటు వినయ్ తన దగ్గరకొచ్చిన విద్యార్థులందరినీ క్షుణ్ణంగా పరిశీలించేవాడు. ఎవరికి ఎందులో ఆసక్తి ఉందో గమనించేవాడు.

వారికి తగ్గ చదువును సూచించేవాడు. తాత తండ్రుల నించి వారసత్వంగా వస్తున్న వృత్తులను ఒదులుకోవద్దని సలహాఇచ్చేవాడు. పెరటి షెడ్డు వృత్తివిద్యల శిక్షణా స్థలమైంది. (మిగతా 27వ పేజీలో)

(19వ పేజీ తరువాయి)

హైస్కూలు, ఇంటరు చదువుతున్న విద్యార్థులు తమ ఆధునిక సైన్సు జ్ఞానాన్ని వృత్తివిద్యలకు జోడించి కొత్త కొత్త ఉపకరణాలు తయారుచేసేందుకు ఉత్సాహపడ్డారు. చేతి వృత్తులనెంచుకున్న కుర్రాళ్ళు తయారుచేసిన వస్తువులను వ్యాపార జ్ఞానం ఉన్న విద్యార్థులు సైకిళ్లకు కట్టుకుని శని, ఆదివారాలు చుట్టుపక్కల ఊళ్లల్లో అమ్ముకురావడం మొదలెట్టారు.

"గృహోపకరణాల మీదే దృష్టి ఉంచండి. కేవలం షోపీస్‌లు తయారుచెయ్యకండి"అని వినయ్ పెట్టిన షరతు బాగా ఉపయోగపడింది.

'పెట్టుబడి సంపాదించండి. లాభాలమీద అప్పుడే ఆశపడకండి'అనేవాడు వినయ్. అతని మాట వేదవాక్కు విద్యార్థులకు.

మూడేళ్ళు గడిచాయి. నీరజమ్మ పుణ్యమా అని సిటీలో పశువైద్యకళాశాల విద్యార్థులు ఆ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. వారానికి రెండుసార్లు పశువైద్యులు వచ్చి చూస్తున్నారు. ప్రభుత్వాసుపత్రి పంది కొక్కుల పాలైంది. వినయ్ పనిచేసే కాలేజీనించి ముగ్గురు ఐఐటి సీట్లు సాధించారు. నలుగురు మెడిసిన్లో చేరారు. "బేసిక్ సైన్సెస్‌ని చిన్న చూపు చూడవద్దు"అని వినయ్ ఇచ్చిన ధైర్యంవల్ల ప్యూర్ సైన్సెస్‌లో ఆసక్తి ఉన్న విద్యార్థులు బయోసైన్స్‌లో చేరడానికి సిగ్గుపడట్లేదు. ఇప్పుడు వినయ్ లక్ష్యం ఊళ్లోకి డిగ్రీ కాలేజ్ తీసుకురావడం. వినయ్ విద్యార్థుల ప్రతిభ చూసిన వ్యాపారవేత్తలు అతనిచేత ఆ ఊళ్ళోనే లాభసాటి కోచింగ్ సెంటర్ పెట్టించాలని విశ్వప్రయత్నం చేసారు. వినయ్ లొంగలేదు. ఇప్పుడు ఆడపిల్లలు కూడా వినయ్ గైడెన్స్‌కోసం పై ఊళ్ల నించి కూడా వచ్చి చేరుతున్నారు. వాళ్ళకి నివాసం నీరజమ్మ ఇల్లే. వినయ్ లాగే ఆదర్శాలు నమ్ముకున్న మరో పది మంది యువకులు అతనితో చేతులు కలిపారు.

కరువులు, వరదలు తట్టుకుని పల్లెలు మామూలు పరిస్థితికొచ్చాయి. వలసపోయిన జనాలు తిరిగి రావడం మొదలయింది.

నీరజ, వినయ్‌లు చేస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు చేయూతనిచ్చాయి. విద్యార్థులకు కొత్తకొత్త వృత్తుల్లో శిక్షణ, సన్నకారు రైతులకు కొత్తకొత్త వ్యవసాయ పద్ధతుల్లో అవగాహన లభిస్తోంది.

ఒక శుభోదయాన, వినయ్ సేవలను గుర్తించిన ఒక అంతర్జాతీయ సంస్థ అతనికి గొప్ప అవార్డును ప్రకటించింది అన్న వార్త వెంకట్రావు చెవుల్లో అమృతం పోసింది.

"ఇంకిప్పుడు మనవాడు కూడా విదేశం వెడతాడు" అని సంబరపడ్డారు వెంకట్రావు, అలివేలు. ఆ సాయంత్రానికల్లా నీరుగారిపోయారు.

"వీడు అక్కడికి వెళ్ళనక్కరలేదుట. వాళ్ళే ఆ దిక్కుమాలిన పల్లెటూరికొచ్చి సన్మానం చేస్తార్ట!"అన్న వార్త తెలిసి. అయినా తప్పదుగా. ఒక్కగానొక్క కొడుక్కి సన్మానం జరుగుతుంటే వెళ్లకపోతే ఇరుగూ పొరుగూ ఏమయినా అనుకోరూ! వెళ్లారు. సుబ్బారాయుడు కూడా తన రాజకీయ అనుచరులతో హంగు చేసాడు.

నీరజ, వినయ్, వారితో చేతులు కలిపి వారి వారి రంగాల్లో పనిచేసిన యువతీ యువకులందరికీ సన్మానం.

బహుమతి రొక్కం ఏర్పాటు పూర్తయ్యాక విదేశీ, స్వదేశీ ప్రముఖులు మాటాడారు.

"ప్రభుత్వం అవినీతిపరులపాలై రక్షకులే భక్షకులై దేశ సంపద కొల్లగొడుతుంటే తమనుతాము ఉద్ధరించుకునే సంస్కృతి ప్రజల్లోంచే రావాలి. అదే విప్లవమంటే. నీతి, నిజాయితీ, విజ్ఞానం, క్రమశిక్షణ అనే కవచాలు ధరించిన సామాన్యుడు ప్రభుత్వాన్ని అదుపుచెయ్యగల సమర్థుడవుతాడు" అన్నాడు గాంధీ తత్వం జీర్ణించుకున్న విదేశీయుడు.

"పల్లె ప్రజలు పొట్టచేత పట్టుకుని వలస పోవడం కాదు. పల్లె నించి వచ్చే ఉత్పత్తులతోనే పట్టణంలో తెల్లారాలి. మన గాంధీ స్ఫూర్తిని అందుకున్న యువతీ యువగాంధీలు రాష్ట్రానికి ఒక పది మంది ఉన్నా మన దేశం ఇంకా ప్రగతిని సాధించగలదు. ఒక కరువునో ఒక వరదనో తట్టుకోలేక విలవిలలాడే పరిస్థితి ఉండేది కాదు. ఒక సారా పేకెట్టుకీ, ఒక బిర్యానీ పొట్లానికీ వోట్లేసే అజ్ఞానం నించి ప్రజలు బయటపడిన రోజు మన దేశం నిజంగా స్వతంత్ర దేశం అవుతుంది"అన్నాడు సేవాతత్పరుడైన స్వదేశీయుడు.

మర్నాడే పట్నానికి తిరిగి వెళ్ళిపోయిన వెంకట్రావు. "అంతా బానే ఉంది. గాంధీగారి పేరుపెట్టిన పెన్ను ఖరీదు లక్షల్లో ఉంది. ఆయన వాడిన వస్తువులు వేలంలో కోట్లు పలుకుతున్నాయి. ఆయన ఆదర్శాలు పట్టుకు వేళ్లాడే అంత చేసినందుకు మనవాడికి మిగిలేదేవిటి?" అని నిట్టూర్చాడు.

"ఈళ్లకేం మిగిలుద్ది? ఆ గాంధీగారికి కొల్లాయైనా మిగిలింది. ఈళ్ళకి మిగిలేది గోచీలే!" ఈసడించుకున్నాడు ఇంట్లో పెళ్లాం దగ్గర సుబ్బరాయుడు.

లెక్కచెయ్యని యువతరం ఇకనైనా దేశం బాగుపడాలని నిశ్శబ్దంగా ప్రక్షాళన చేసుకుంటూ పోతోంది.

ముందుతరం రాజకీయ స్వార్థంతో బురద పట్టిపోయినప్పుడు తరువాతి తరం ఆశయసిద్ధికోసం ముందుకు అడుగులు తప్పక వేస్తుంది. పంకంలోంచేగా పద్మాలు పుట్టుకొస్తాయి!

"గాంధీని బ్రాండ్ ఎంబాసిడర్ చెయ్యడం కాదు. భారతీయ యువత గాంధీ తత్వానికి బ్రాండ్ ఎంబాసిడర్స్‌గా జీవించాలి" తన ఆశ్రయం/మంలో విద్యార్థులని ఉత్తేజపరుస్తున్నాడు వినయ్.


ఎవరి గుర్తింపునూ ఆశించకుండా నిశ్శబ్దంగా వినయ విప్లవం సాగుతూనే ఉంటుంది గాంధీగారి భారతదేశంలో.

★

**రచయిత చిరునామా:**
**పోడూరి కృష్ణకుమారి,**
**501, హైలైట్ హావేలీ,స్ట్రీట్ నెం.6, హబ్సిగూడ,**
**హైదరాబాద్- 500 007.**

# స్మైలీ సింబల్‌కు 47 ఏళ్లు

ఇంటర్నెట్‌తో సంబంధం గల వారికి స్మైలీ ముఖం సుపరిచితం. గుండ్రటి పసుపురంగు చంద్రుడి మీద రెండు కళ్ళు, నవ్వేనోరుని స్మైలీ అంటారు. దీన్ని 1963లో అమెరికాలో మసాచుసెట్స్‌లోని వర్సెస్టర్ అనే ఊరికి చెందిన హార్వేబాల్ గీసాడు. ఇతను అమెరికాలో కమర్షియల్ ఆర్టిస్ట్ ది స్టేట్ మ్యూచువల్ లైఫ్ ఎస్యూరెన్స్ కంపెనీ (ఇప్పుడు హానోవర్ ఇన్సూరెన్స్) ఒహాయో రాష్ట్రానికి చెందిన గేరంటీ మ్యూచువల్ కంపెనీని కొనేసింది. దాంతో గేరంటీ మ్యూచువల్ కంపెనీ ఉద్యోగస్తులు నిరాశకి గురయ్యారు. దీన్ని పరిష్కరించడానికి 1963లో ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్ హార్వేబాల్‌ని ఓ బొమ్మ గీయమని నియోగించారు. పది నిముషాల్లో హార్వే స్మైలీ బొమ్మని గీసేసాడు. దాన్ని బటన్స్‌మీద బల్లమీద ఉంచే కార్డులమీద, పోస్టర్స్ మీద ముద్రించి అవి తమ ఉద్యోగస్తులకి కనబడేలా స్టేట్ మ్యూచువల్ కంపెనీ ఆఫీస్‌లో ఉంచింది. తమ వంద మంది ఉద్యోగస్థులు ఎక్కువగా నవ్వుతూండటానికి అవి ఉపయోగిస్తాయని ఆశించింది. చొక్కా జేబుకి పెట్టుకునే స్మైలీ బటన్స్ త్వరలోనే పాపులర్ అయ్యాయి. బయటివారు కూడా వీటిని కొనడంతో పదివేలు అమ్ముడయ్యాయి. 1971కల్లా ఐదు కోట్ల స్మైలీ బటన్స్ అమ్ముడయ్యాయి. త్వరలోనే చిరునవ్వుకి స్మైలీ అంతర్జాతీయ చిహ్నంగా మారింది.



ఈ బొమ్మ గీయడానికి హార్వేకి 45డాలర్లు ముట్టాయి. అతను దీన్ని తన కాపీరైట్‌గా రిజిస్టర్ చేసుకోలేదు. స్టేట్ మ్యూచువల్ కంపెనీ కూడా రిజిస్టర్ చేసుకోలేదు. ఇందుకు హార్వే ఎన్నడూ చింతించలేదు. 'టెలిగ్రాం అండ్ గెజెట్' అనే వర్సెస్టర్ నించి వచ్చే దినపత్రికలో (ఇది న్యూయార్క్ టైమ్స్ యొక్క ప్రాంతీయ దినపత్రిక) ఓ ఇంటర్వ్యూలో హార్వే ఇలా చెప్పాడు.

"నేను ఓసారి ఒకే స్టీక్‌ని తినగలను. ఒకే కారుని డ్రైవ్ చేయగలను. ఎక్కువ సంపాదించి ఏంచేసుకోను?"

అయితే 1970లలో బ్రదర్స్ బెర్నార్డ్, ముర్రే స్పెయిన్ అనే ఇద్దరు స్మైలీ బొమ్మకి 'హేవ్ ఏ నైస్ డే' అనే పదాల్ని జోడించి ట్రేడ్ మార్క్‌గా రిజిస్టర్ చేసుకున్నారు. ప్రపంచమంతటా స్మైలీ ఫేస్‌కి, ఇంటర్నెట్ ద్వారా మునుపటికన్నా అధిక ప్రచారం లభించింది.

అమెరికాలో టీషర్ట్స్, కప్పులు, గ్రీటింగ్ కార్డ్స్ మొదలైన వాటి మీద స్మైలీ బొమ్మని అధికంగా ముద్రించారు. దీన్ని ఇంతగా కమర్షియలైజ్ చేయడం హార్వేకి నచ్చలేదు. అతను 'ది వర్డ్ స్మైల్ కార్పొరేషన్'ని 1999లో స్థాపించి, 'వరల్డ్ స్మైల్ డే'ని అక్టోబర్ నెలలో మొదటి శుక్రవారం జరుపుకునేలా చేసాడు. ఈ కార్పొరేషన్ లాభాపేక్ష లేని ధార్మిక సంస్థ ఇది. పేదలైన చిన్న పిల్లలకి సహాయం చేస్తుంది. దీని బై లైన్ 'డ్యూ యాన్ ఏక్ట్ ఆఫ్ కైండ్‌నెస్- హెల్ప్స్ ఒన్ పర్సన్ స్మైల్.'

జూలై 18, 1998న స్మైలీ డిజైన్ జరిపిన ముప్పైఐదవ యానివర్సరీ రోజు బాల్ 'ది ఎంటర్టైన్‌మెంట్' అనే కామెడీ వస్తువులు అమ్మే వర్సెస్టర్‌లోని వివిధ స్మైలీ ఆర్టికల్స్‌మీద సంతకాలు చేసాడు. హార్వే ఈ స్మైలీని రిజిస్టర్ చేసుకోకపోవడంతో డేల్ జిబ్బన్స్ అనే చిత్రకారుడు 1986లో దీన్ని దుర్వినియోగం చేసాడు. స్మైలీ మొహంమీద రక్తాన్ని చిందించి ఓ కామిక్ సిరీస్‌ని ముఖ చిత్రంగా వాడాడు.

రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న హార్వే బాల్ దీనికి చింతించాడు. హార్వే బాల్‌కి వినిఫ్రెడ్ అనే భార్య, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు అనేకమంది మనవలు, ముని మనవలు ఉన్నారు.

హార్వే స్మైలీని రూపొందించిన ఇంటిని, సిటీ ఆఫ్ వర్సెస్టర్ జూన్ 2007లో ఐదు లక్షల డాలర్లకి కొన్నది. హార్వేబాల్ కన్సర్వేషన్ ఏరియా అనే సాంక్చురీని ఆ ఇంటి చుట్టుపక్కల అభివృద్ధిచేసారు. హార్వే ఇంటికి వెళ్ళే రోడ్డుకి స్మైలీ ఫేస్ ట్రయల్'అనే పేరుపెట్టారు. హార్వే బాల్‌కి వృద్ధాప్యంలో లివర్‌కి సంబంధించిన వ్యాధి వచ్చింది. ఎక్కువకాలం బాధపడకుండా తన డెబ్భైతొమ్మిదో ఏట ఏప్రిల్ 12, 2001న అతను మరణించాడు.

బొమ్మని సృష్టించిన ఖ్యాతి తనని అంటనివ్వకుండా హార్వే ఎంతో నిరాడంబరంగా జీవించడం విశేషం. అమెరికన్ ప్రభుత్వం స్మైలీ బొమ్మని తపాలా బిళ్ళగా కూడా విడుదల చేసి హార్వేని గౌరవించింది.

**- డి.పద్మజ**